క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో శనివారం 5, 4వ తరగతుల విద్యార్థులకు బల్మూర్ మండలం మహదేవ్‌పూర్ చెందిన ఉద్యోగి ఇమ్మడి సైదులు నవోదయ, గురుకుల పాఠశాలల ప్రవేశానికి ఉపకరించే స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. 'పే బ్యాక్ టు ది సొసైటీ'లో భాగంగా పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు సైదులు తెలిపారు. శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత పేద వారికి సాయం అందించాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

ఆలయానికి శేషపడిగల బహూకరణ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి శేషవాహనంపై పయణించేందుకు వెల్దండ మండలం కొట్ర మాజీ సర్పంచ్ గీతా బాలస్వామి దంపతులు శనివారం బహూకరించారు. రూ.60వేల విలువ గల వీటిని స్వామివారి కోసం బహూకరించినట్లు తెలిపారు.

క్రిస్మస్ వేడుకలు

కొల్లాపూర్: పట్టణంలోని ఏషియన్ డైమండ్ స్కూల్‌లో శనివారం అడ్వాన్స్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. శాంటాక్లాజ్ వేషధారణలో విద్యార్థులు అలరించారు. పండుగ ప్రత్యేకతను ప్రిన్సిపాల్ క్యాథరిన్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరాలయంలో శనివారం భక్తులు తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తుల చేత మంత్రోచ్చరణ చేయించారు. అనంతరం భక్తులు శివున్ని దర్శించుకున్నారు.

శివాలయంలో పడిపూజ



తాడూరు: మండలంలోని చర్ల ఇటిక్యాలలోని శివాలయంలో పడిపూజ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి ఇరుముడితో భక్తులు మద్దిమడుగు ఆంజనేయస్వామి వద్దకు వెళ్లారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ



అచ్చంపేట రూరల్: పట్టణంలోని బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో నిరాశ్రయులుగా ఉన్న వారికి గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది దుప్పట్లు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది చలి తీవ్రంగా ఉందని, ముందు జాగ్రత్తగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశామని సభ్యులు బాబా, మగ్బుల్, హబీబ్, మోయిజ్, ఇమ్రోజ్ తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

కందనూలు: మున్నూరు కాపుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేయాలని మున్నూరుకాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తీగల సుభాష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు ఫంక్షన్‌హాల్ లో నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తీగల సుభాష్, ప్రధాన కార్యదర్శిగా పాలమూరు సతీష్, కోశాధికారిగా తీగల జగదీష్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా యూత్ కమిటీ అధ్యక్షుడిగా కందూరి కృష్ణకుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా తీగల దినేష్, కోశాధికారిగా జంగిటి రామ్ ప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇరుకుగా పంచాయతీ భవనాలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో పంచాయతీ భవనాలు ఇరుకుగా ఉండడంతో సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందికరంగా మారింది. మండల కేంద్రంలోని పంచాయతీ భవనానికి రూ.22 లక్షలు మంజూరు కాగా కాంట్రాక్టర్ టెండర్ పాడి పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి.



పెంట్లవెల్లిలో..



వట్టెంలో పూజలు చేస్తున్న అర్చకులు

ఉత్తర ద్వారం.. పుణ్యఫలం



కల్వకుర్తిలో వేంకటేశ్వర స్వామి మూలవిగ్రహం



కొల్లాపూర్‌లో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: అత్యంత పవిత్రమైన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం అచ్చంపేట పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● మన్ననూర్ స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణి మహిళా సంఘం వారి ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి, గీతా జయంతి పర్వదినం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహచారి మూలవిరాట్ పూజలు నిర్వహించారు.

● పెద్దకొత్తపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని వేంకటేశ్వర స్వామి దేవాలయాలలో భక్తులు తెల్లవారుజాము నుంచే లక్ష్మీనారాయణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్తర ద్వారం ద్వార దర్శనం చేసుకున్నారు.

● పెంట్లవెల్లి, జటప్రోలు, మంచాలకట్ట ఆలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం 5:30 గంటల నుంచే పూజలు ప్రారంభించారు. గణపతి, కలశ పూజ, అభిషేకం నిర్వహించారు.

● లింగాల మండలంలో కోదండరామాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు రామాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఉప్పునుంతల మండలంలోని మామిళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● అమ్రాబాద్ కోదండ రామాలయం వద్ద ఉత్తర ద్వార దర్శనం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● తెలకపల్లిలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● బిజినేపల్లి మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి దేవస్థానం, పాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో ఉదయం నుంచి భక్తులు ఉత్తరద్వారం నుంచి స్వామి వార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

● తాడూరు మండలంలోని సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉదయం నుంచి సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకం నిర్వహించారు.

● కల్వకుర్తి పట్టణంలోని వేంకటేశ్వర, వాసవీకన్యకా పరమేశ్వరి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున అభిషేకాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని జనార్దనస్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

● కోడేరుతో పాటు గ్రామాల్లో స్వామివారికి అభిషేకం, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు అర్చకుడు జంగం శివయ్య తెలిపారు.

● కొల్లాపూర్‌లోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మాధవ స్వామి ఆలయం, శ్రీరామ మందిరం, బండాయి గుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయం, భగవద్గీత మందిరంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటుచేశారు. ఆలయాల్లో సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు.



లింగాలలోని కోదండరామాలయంలో..



తెలకపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



దేవల్‌తిరుమలాపూర్‌లో పూజలు..



తాడూరులో సామూహిక వ్రతాలు..

మార్మోగుతున్న హనుమన్నామస్మరణ

అమ్రాబాద్: హనుమాన్ దీక్ష మాలవిరమణ ఉత్సవాల సందర్భంగా నల్లమల లోతట్టు ప్రాంతమైన పదర మండలంలోని మద్దిమడుగు క్షేత్రంలో వెలిసిన పబ్బతి శ్రీఆంజనేయస్వామి సన్నిధికి భక్తులు చేరుకుంటున్నారు. ఆంజనేయ దీక్షమాలధారణ పొందిన స్వాములతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మద్దిమడుగుకు వస్తున్నారు. దీంతో ఈ క్షేత్రంలో హనుమన్నామస్మరణ మార్మోగుతుంది. మద్దిమడుగు ఆంజనేయ స్వామి దీక్షమాల విరమణ ఉత్సవాలు శనివారం నాటికి రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. స్వామి సన్నిధిలో దీక్షమాల విరమణ పొందుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రంగాచారి, అర్చకులు వీరయ్యశాస్త్రి బృందం ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పంచగవ్యం, వాస్తుపూజ, హోమం, రుద్రహోమం, స్వామివారికి సహస్రనామార్చన, మన్యు సూక్తహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. రాత్రికి అమ్మవారి సేవ నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారనే ఉద్దేశంతో ఆలయ అధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

31న ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారం



కందనూలు: ఎదిరేపల్లి మశమ్మ స్మారక పురస్కారం ప్రముఖ రచయిత్రి డాక్టర్ వినోదిని మాదాసుకు ప్రదానం చేస్తున్నట్లు పురస్కార కమిటీ చైర్మన్ ఎదిరెపల్లి కాశన్న తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఈ అవార్డు పురస్కార కరపత్రాలను కవులు, రచయితలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 31న ఉదయం 11గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశపు హాల్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ప్రొ.చింతకింది కాసీం, అవార్డు గ్రహీత డా.వినోదిని మాదాసు హాజరవుతున్నారని తెలిపారు. కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బయ్య, మోహన్, వహీద్‌ఖాన్, దినకర్, శివశంకర్, మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు

క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: క్రిస్మస్ వేడుకలను పురస్కరంచుకుని ప్రభుత్వం అందించిన దుస్తులను ప్రజాప్రతినిధులు క్రైస్తవులకు శనివారం పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో అందజేశారు. క్రిస్మస్ ఫీస్ట్ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఏసు సూచించిన మార్గంలో నడవాలన్నారు. శాంతి, కరుణ అనుసరిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీపీ బోజ్యానాయక్, జెడ్పీటీసీ జూపల్లి భాగ్యమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు జ్యోతి, శ్రీలక్ష్మీయాదవ్, మేకల శిరీషయాదవ్, రాముడుయాదవ్, పసుపుల నర్సింహతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

'తొలిమెట్టు' పరిశీలన



ఈరట్వానిపల్లి పాఠశాలలో రికార్డులను పరిశీస్తున్న నోడల్ అధికారి, బృందం

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు కాంప్లెక్స్ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని శనివారం మండల నోడల్ అధికారి చంద్రశేఖర్, బృందం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను, తెలుగు, గణితం, ఆంగ్లంలో వచ్చిన కొత్త విధానాలు, కృత్యాలను వారు తనిఖీ చేశారు. అదే విధంగా సోపానాల ప్రకారంగా విద్యాబోధనను, నెలనెలా విద్యార్థుల ప్రగతిని అంచనా వేసే విధానాలను వారు పరిశీలించారు. పాఠశాలల్లో సమాజ భాగస్వామ్యాన్ని నెలకొల్పడానికి, విద్యా ప్రగతికి గ్రామ పెద్దలతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాభిమానుల సలహాలు, సూచనలు తీసుకోవాలని నోడల్ అధికారి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిశేఖర్, తొలిమెట్టు రిసోర్స్ పర్సన్ రామస్వామి, సీఆర్‌పీ శ్రీను పాల్గొన్నారు.

సామర్థ్యాలను గుర్తించి చదివించాలి..

అమ్రాబాద్: విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారు మంచి చదువులు చదివే విధంగా కృషి చేయాలని తొలిమెట్టు మండల నోడల్‌అధికారి సిద్దార్థ్ సూచించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని లక్ష్మాపూర్(బీకే) మాదవానిపల్లి, కుమ్మరోనిపల్లి పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కందనూలు: జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శనివారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మట్లాడుతూ ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలకు చెందిన పల్లవి గ్రూప్ జానపద నృత్యంలో, జానపద గేయాలు మమత గ్రూప్ ప్రథమ, భాగ్యలక్ష్మి గ్రూప్ ద్వితీయ బహుమతి, జానపద నృత్యానికి నిఖిత ద్వితీయ బహుమతి, కథా రచనకు అనూష ప్రథమ బహుమతి, పోస్టర్ తయారీకి రహీంబీ ప్రథమ బహుమతి, అనిత ద్వితీయ బహుమతి, వకృత్వ పోటీలో నాగాక్షిత ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మి, వెంకటేశ్వరరావు, షహజాది బేగం, లింగయ్య, ఇక్బాల్, శ్రీనివాసులు, పద్మజ పాల్గొన్నారు.

చెత్త రీసైక్లింగ్ సెంటర్ ప్రారంభం



డీఆర్‌సీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్,

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీబీఎం కళాశాల వెనకాల ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన చెత్త రీసైక్లింగ్ సెంటర్ డీఆర్‌సీసీని కమిషనర్ అశ్రిత్‌కుమార్ మహిళా సంఘాల ఆర్పీలతో కలిసి శనివారం ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సేకరించే పొడిచెత్త ద్వారా పలు రకాల వస్తువులను తయారుచేసే పద్ధతిని కమిషనర్ ఆర్పీలకు వివరించారు. డీఆర్‌సీసీ సెంటర్ ప్రారంభానికి ముందు కమిషనర్ ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తున్న ఆటోల వద్దకు వెళ్లి ప్రజలకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటివారికి పాఠాలు బోధించారు. హెచ్‌ఎం భగవాన్‌గౌడ్, గోపాల్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



ఎమ్మెల్యే వంశీకృష్ణకు మొక్క అందిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్‌తో పాటు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు శనివారం పట్టణంలోని ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మున్సిపల్ సాధారణ సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌరీశంకర్, మనోహర్‌ప్రసాద్, తగురం శ్రీనివాసులు, సోమ్లానాయక్, రమేష్‌యాదవ్, అంతటి శివ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 12 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న మెజిస్ట్రేట్ జ్యోత్స్న గుంటి

కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం ప్రీ సిట్టింగ్ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మెజిస్ట్రేట్ జ్యోత్స్న గుంటి సమక్షంలో 12 కేసులు రాజీ అయ్యాయి. వీటిలో కోడేరు పీఎస్ పరిధిలోని 5 క్రిమినల్ కేసులు, కొల్లాపూర్ పీఎస్ పరిధిలోని 7 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు పరిష్కారమయ్యాయి. డ్రంకెన్ డ్రైవర్ కేసుల్లో రూ.6,700 జరిమానాలు విధించారు. లోక్ అదాలత్ సభ్యుడిగా పోతుల నాగరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్ రెడ్డి, నజీరోద్దీన్, రామలక్ష్మమ్మ, కోర్టు సూపరింటెండెంట్ భోగ హరికృష్ణ తదితరులున్నారు.

కేసుల రాజీకి అవకాశం..

వెల్దండ: కల్వకుర్తిలో ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు, ఇరువర్గాల వారు రాజీ చేసుకోని కోర్టులో కేసులను తొలగించుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేసులు రాజీచేసుకోవాలనుకునే ఇరువర్గాల వారు ఈనెల 29వ తేదీ వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలన్నారు.

అసంపూర్తి రోడ్లను పూర్తిచేయండి

● ఎంపీపీ ఉమామహేశ్వరి
● సమస్యలు, పలు అంశాలపై మండల సభలో చర్చ



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, చిత్రంలో ఎంపీపీ ఉమామహేశ్వరి

పెంట్లవెల్లి: పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ ఉమామహేశ్వరి అధికారులను ఆదేశించారు. శనివారం ఎంపీపీ, ఎంపీడీఓ రామయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా విద్యుత్, రోడ్లు, నీటి సమస్యలపై చర్చించారు. ఆయా శాఖల వారు గడిచిన మూడు నెలల్లో పనులపై చర్చించి ఒక్కొక్క శాఖపై సమీక్షించారు. ముఖ్యంగా ఆర్‌అండ్‌బీ శాఖ వారికి గతంలో పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లను పూర్తి చేయకుండా మరమ్మతు చేసి గాలికొదిలేశారు. సంబంధిత కాంట్రాక్టర్లను పిలిచి అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేయించాలని ఆర్‌అండ్‌బీ ఏఈ రవికి ఎంపీపీ సూచించారు. అంతేకాకుండా చేపట్టే రోడ్ల పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలను తీర్చాలని యంగంపల్లి సర్పంచ్ గోపినాయక్, కొండూరు సర్పంచ్ గోపాల్ సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలలో రేషన్ దుకాణాలలో తూకం విషయాల్లో అవకతవకలపై విచారించాలని కోరారు. 5 ఏళ్లలో అధికారంలో లేమని ఎన్నో ఇబ్బందుల పడ్డామని ఏ పనికి వెళ్లినా అయ్యేది కాదని, ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పూర్తి చేయాలని సర్పంచ్‌లు సమావేశంలో లేవనెత్తారు. అందరిని సమానంగా అధికారులంతా పనిచేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి అధికారి గ్రామాలలో ఉన్న ముఖ్యమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి కొంతమందే అధికారులు హాజరవుతున్నారని, ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఆదేశించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ విషయంలో రైతులకు అన్ని విధాలుగా సకాలంలో అందుబాటులో ఉంటామని, నియోజకవర్గానికి త్వరలోనే మంజూరైన మ్యాంగో మార్కెట్‌కు కృషి చేస్తామన్నారు. గతంలో ఈ ప్రతిపాదన ఎన్నో సార్లు పంపించామని, మంజూరైనా కొన్ని కారణాల వల్ల మొదలు కాలేదన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు అనుకూలంగా సీసీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భీంరెడ్డి, ఎంపీఓ భరత్, మతిన్, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు తదితరులు పాల్గొన్నారు.